ప్రజాశక్తి
శుక్రవారం 21 ఫిబ్రవరి, 2025
5
శ్రీకాకుళం



గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బిసి సంక్షేమ శాఖ పరిధిలో అంపోలులోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్, 5వ తరగతి, బ్యాక్‌లాగ్ (6, 7, 8, 9 తరగతులు) ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బిసి సంక్షేమాధికారి అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు https://mjpapbcwreis.apcfss.in వెబ్‌సైట్‌లో మార్చి 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ 20వ తేదీన ఇంటర్, ఏప్రిల్ 27న 5వ తరగతి, 28న ఇతర బ్యాక్‌లాగ్ విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9618880991 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

గ్రంథాలయాలకు గడ్డుకాలం

- లైబ్రరీలకు సెస్‌ను జమ చేయని పంచాయతీలు
- జిల్లావ్యాప్తంగా రూ.తొమ్మిది కోట్లు పెండింగ్
- ఒక్క కొత్త పుస్తకమూ కొనలేని దుస్థితి
- పేపర్ బిల్లులనూ చెల్లించలేని దీనావస్థలో బిడిసిలు



జిల్లా కేంద్ర గ్రంథాలయం

జిల్లాలో గ్రంథాలయాలు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం నుంచి సాయం అందక, పంచాయతీల నుంచి రావాల్సిన సెస్ డబ్బులూ చేరక తీవ్ర నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయి. కనీసం ఒక్క కొత్త పుస్తకమూ కొనలేని దుస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బుక్ డిపాజిట్ సెంటర్ల (బిడిసి) పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది. ఏడాదికి పైగా అక్కడ పనిచేస్తున్న వారికి రెమ్యునరేషన్ ఇవ్వలేకపోతున్నారు. బిడిసిలకు పత్రికల కొనుగోలు కోసం ప్రతి నెలా ఇవ్వాల్సిన డబ్బులనూ అందించలేకపోతున్నారు. డబ్బులు ఎప్పటికైనా వస్తాయనే ఆశతో నిర్వాహకులే అప్పులు చేసి పత్రికల బిల్లులను చెల్లిస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో శ్రీకాకుళం నగరంలోని కేంద్ర గ్రంథాలయంతో సహా మొత్తం 45 గ్రంథాలయాలు ఉన్నాయి. ఐదు చోట్ల గ్రామీణ గ్రంథాలయాలు నడుస్తున్నాయి. వీటితోపాటు జిల్లావ్యాప్తంగా 30 మండలాల పరిధిలో ముఖ్యమైన గ్రామాల్లో పాఠకుల అవసరాలు, గ్రామస్తుల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని 108 చోట్ల బుక్ డిపాజిట్ సెంటర్లను ఏర్పాటు చేశారు. జిల్లాలోని గ్రంథాలయాలకు, బిడిసిలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందడం లేదు. అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు, సిబ్బందికి జీతాల గ్రాంట్ తప్ప మరే ఇతర నిధులు ఇవ్వడం లేదు. అదీ మూడు, నాలుగు నెలలకోసారి ఇస్తోంది. పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి వచ్చే సెస్సే వాటికి ప్రధాన ఆర్థిక వనరు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస మున్సిపాలిటీల నుంచి కొంత మేర సెస్ సొమ్ము గ్రంథాలయాల ఖాతాల్లో జమ అవుతున్నా, పంచాయతీలు మాత్రం డబ్బులు ఇవ్వకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి.


వసూలు చేసిన డబ్బులు ఏమైనట్లు?

పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అధికారులు ప్రతి ఏడాదీ ప్రజల నుంచి క్రమం తప్పకుండా ఇంటి పన్ను వసూలు చేస్తున్నారు. ఇంటి పన్నుతో పాటు ఎనిమిది శాతం లైబ్రరీ సెస్‌నూ తీసుకుంటున్నారు. మున్సిపాలిటీల నుంచి రావావల్సిన సెస్ సొమ్ములు కాస్త అటూ ఇటుగా గ్రంథాలయాల ఖాతాల్లో జమ అవుతున్నా, పంచాయతీల నుంచి మాత్రం ఆ మేరకు జమ కావడం లేదని తెలుస్తోంది. జిల్లాలో 921 పంచాయతీలు ఉన్నాయి. ప్రతి ఏడాదీ ఇంటి పన్ను రూపంలో రూ.22 కోట్ల వరకు వసూలు అవుతోంది. ఇందులో గ్రంథాలయాలకు రూ.1.76 కోట్ల వరకు ఇవ్వాల్సి ఉంటుంది. ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో, కోట్ల రూపాయల మేర బకాయిలు పేరుకుపోయాయి. గ్రంథాలయాల అధికారులు చెప్తున్న లెక్కల ప్రకారం 2021 నుంచి బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. సుమారు రూ.తొమ్మిది కోట్లకు పైగా సొమ్ములు గ్రంథాలయాలకు చెల్లించలేదని సమాచారం. సెస్ రూపంలో వసూలు చేసిన డబ్బులు గ్రంథాలయాల ఖాతాలకు చేరకుండా ఏమైనట్లు అన్న సందేహాలు అందరిలోనూ కలుగుతున్నాయి. సర్పంచ్‌లు, కార్యదర్శులు పంచాయతీల్లో పనులకు ఆ నిధులను మళ్లించారేమోనన్న అనుమానాలను లైబ్రేరియన్స్ వక్తం చేస్తున్నారు.

పత్రికల కొనుగోలుకూ డబ్బులు లేని వైనం

గ్రంథాలయాలకు పత్రికల కొనుగోలుకు ఇబ్బంది లేకపోయినా, బుక్ డిపాజిట్ సెంటర్ల నిర్వాహకులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పత్రికల కొనుగోలు కోసం వారికి నెలకు రూ.600 అందించాల్సి ఉంది. సెస్ డబ్బులు జమ కాక ఏడాదికి పైగా వారికి చెల్లించలేదు. బిడిసిలను నిర్వాహకులకు నెలకు రూ.మూడు వేలు రెమ్యునరేషన్ చెల్లించాల్సి ఉండగా, 2023 డిసెంబరు నుంచి ఇప్పటివరకు 14 నెలల పాటు ఇవ్వలేదు.

సెస్ డబ్బులే గ్రంథాలయాలకు ఆదాయ వనరు



పంచాయతీల నుంచి వచ్చే సెస్ డబ్బులే గ్రంథాలయాలకు ప్రధాన ఆదాయ వనరు. గ్రంథాలయాల్లో కొత్త పుస్తకాలు, ఫర్నిచర్ కొనుగోలు చేయడానికి ప్రత్యేక గ్రాంట్లేమీ రావు. సెస్ డబ్బులతోనే అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. బుక్ డిపాజిట్ సెంటర్ల నిర్వహణపై సెస్ నుంచి వచ్చే సొమ్ముల పైనే ఆధారపడి ఉంది. పంచాయతీలు వసూలు చేసిన లైబ్రరీ సెస్‌ను సకాలంలో చెల్లిస్తే గ్రంథాలయాల ఇబ్బందులు తీరుతాయి.

- బుర్రి కుమార్ రాజు,
జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

పంచాయతీలకు సర్క్యులర్ జారీ చేస్తాం



జిల్లాలో 50 నుంచి 60 శాతం వరకు పంచాయతీలు గ్రంథాలయాలకు చెల్లించాల్సిన సెస్‌ను చెల్లిస్తున్నాయి. ఏయే పంచాయతీల నుంచి సెస్ పెండింగ్ ఉందో గుర్తించి, సర్క్యులర్‌ను జారీ చేస్తాం. పంచాయతీల నుంచి సెస్ సొమ్ములు సకాలంలో చెల్లింపులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

- భారతీ సౌజన్య,
జిల్లా పంచాయతీ అధికారి

కలెక్టర్ ఆదేశించినా స్పందన కరువు

పంచాయతీల నుంచి గ్రంథాలయాలకు రావాల్సిన నిధులపై ఇటీవల కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పంచాయతీ, గ్రంథాలయ సంస్థ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. పంచాయతీల నుంచి రావాల్సిన సెస్ సొమ్ములు గ్రంథాలయాలకు జమయ్యేలా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్యను ఆదేశించారు. అయినా పంచాయతీ కార్యదర్శుల్లో స్పందన కనిపించడం లేదు.


ఈ-క్రాప్ వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

- ఈ-క్రాప్, భూ సర్వేపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - ఆమదాలవలస

రీ సర్వేతో దీర్ఘకాలికంగా ఉన్న రైతుల భూ సమస్యలకు చెక్ పెట్టవచ్చని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ పరిధిలోని రీ సర్వే పైలట్ విలేజ్ ఆనందపురం గ్రామాన్ని గురువారం సందర్శించారు. సర్వేలోని లోటుపాట్లను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వే తో రైతులకు మేలు చేకూరుతుందని చెప్పారు. భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ రీ సర్వేను చేపడుతోందన్నారు. సర్వే సక్రమంగా నిర్వహించి రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆనందపురం గ్రామం రహదారి నిలిచిపోవడానికి గల కారణాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్‌కు సంబంధించిన సమస్య ఉండడంతో రహదారి పనులు నిలిచిపోయాయని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇరిగేషన్ అధికారులను పంపించి సమస్యను పరిష్కరించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీనిచ్చారు. మునగవలస పంచాయతీ దన్నానపేట, టి.జొన్నవలస సచివాలయ పరిధిలోని సంత కొత్తవలసలో రబీ పంటల స్థితిగతులు, ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను సమీక్షించారు.

ఈ-క్రాప్, రబీ పంటలపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. పొలాల్లో రబీ పంటలను పరిశీలించి రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ-పంట నమోదు వల్ల పంట నష్టపరిహారం కొనుగోలు కేంద్రాల్లో పంట అమ్మకాలు, పురుగు మందులు, ఎరువులు తదితర ప్రభుత్వ పథకాలకు అర్హత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె.త్రినాథస్వామి, ఎడి బగ్గు రజని, తహశీల్దార్ రాంబాబు, మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

నేడు జెడ్‌పి స్థాయీసంఘ సమావేశాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన స్థాయీ సంఘ సమావేశాలు కోరం లేకపోవడంతో వాయిదా పడ్డాయి. ఈ సమావేశాలు ఈనెల 21న ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతాయని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎల్.ఎన్.వి శ్రీధర్ రాజా తెలిపారు. 10.30 గంటలకు 6వ స్థాయి, 11.30 గంటకు 3వ స్థాయి, మధ్యాహ్నం 12.30 గంటలకు 5వ స్థాయి సంఘం సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 2, 4, 1, 7 స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహిస్తామని వివరించారు.


ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయగౌరి

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి
- పలుచోట్ల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ (అనకాపల్లి)

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, మండలిలో ఉత్తరాంధ్ర వాణిని వినిపిస్తానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. గురువారం ఆమె అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఉపాధ్యాయులను కలిసి ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాను సామాన్య కుటుంబం నుంచి వచ్చానని, సుదీర్ఘకాలం ఉపాధ్యాయ ఉద్యమంలో ఉన్నానని, అందరి సాధకబాధకాలు తెలుసునని అన్నారు. ప్రస్తుతం చట్టసభల్లో పేదలు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రస్తావించే వారు కరువవుతున్నారన్నారు.

తాను గెలిస్తే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల వాణిని కౌన్సిల్‌లో బలంగా వినిపించగలనని, పోరాడగలనని చెప్పారు. సిపిఎస్, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్న యాప్‌ల రద్దుకు కృషి చేస్తానన్నారు. ఆమె వెంట జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులు రెడ్డి, యుటిఎఫ్ నాయకులు చిట్టయ్య, మోహన్, గాయత్రి, సిఐటియు నాయకులు అడిగర్ల రాజు ఉన్నారు.

మార్చి 31 నాటికి పనులు పూర్తి

- జిల్లా అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సిఎస్ఆర్ నిధులతో చేపడున్న అభివృద్ధి పనులను మార్చి 31వ తేదీ లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్య ప్రణాళికా విభాగం ఆధ్వర్యాన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పలు పరిశ్రమలు, కార్పొరేట్ యాజమాన్య ప్రతినిధులతో గురువారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచినీటి వసతి, సోలార్ లైట్ల ఏర్పాటు, పాఠశాలలు, కళాశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రభుత్వాస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పన, కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు తోడ్పాటు, పలాసలో డయాలసిస్ యూనిట్ల నిర్వహణ, జిల్లాలో క్రీడా ప్రాంగణాల నిర్మాణం వంటి పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు.

పనుల అంచనాలను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మార్చి 31లోగా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని అధికారులకు సూచించారు. పూర్తయిన పనుల నిర్వహణ బాధ్యతలను స్థానిక సంస్థలు గానీ సంబంధిత ప్రభుత్వ శాఖలు చేపట్టాలని నిర్ణయించారు. జిల్లా అభివృద్ధికి కార్పొరేట్ సంస్థల సహకారాన్ని కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు.

సమావేశంలో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్, అరబిందో ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, మహదాన్ అగ్రిటెక్ పొన్నాడ, యునైటెడ్ బేవరేజెస్ రణస్థలం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఎస్‌బిఐ, యుబిఐ, ఐసిఐసిఐ బ్యాంక్ ప్రతినిధులు, సిపిఐ వి.ఎస్.ఎస్.ఎల్ ప్రసన్న, ఆర్‌అండ్‌బి సూపరింటెండెంట్ ఇంజినీర్ జాన్ సుధాకర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

సుందర శ్రీకాకుళంకు కృషి

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఇందులో భాగంగా రూ.40 కోట్ల వ్యయంతో ప్రధాన కాలువలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. నగరంలోని న్యూకాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఎమ్మెల్యేను గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే పాలకొండ రోడ్డు సెంటర్ డివైడర్, విద్యుద్దీకరణ, పెద్దపాడు రోడ్డు విస్తరణ, కళింగ రోడ్డు, అరసవల్లి రోడ్డు సెంటర్ లైటింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. ప్రధాన కూడళ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టామని వివరించారు. డేఅండ్‌నైట్, రామలక్ష్మణ జంక్షన్ రోడ్డులో ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు ప్రజలు పూర్తి సహకారం అందించాలన్నారు. న్యూకాలనీ వాసులకు నగరంలో విశాలమైన రోడ్లు, ఇతర మౌళిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, అలాగే హౌసింగ్ బోర్డు, కాలనీలు, పిఎన్ కాలనీ ప్రాంతంలోను ఇటువంటి సౌకర్యాలు కలిగి ఉన్నారన్నారు. నగరంలో మిగిలిన చోట్ల కనీసం కాల్వల నిర్మాణం చేపట్టగలిగితే అక్కడున్న ప్రజలకు సౌకర్యవంతమైన జీవనం సాధ్యమవుతుందన్నారు. నిధులు సమకూర్చి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యూకాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు డాక్టర్ కె.సోమేశ్వరరావు, సురంగి మోహనరావు, అంధవరపు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్లాస్ 3, 4 ఉద్యోగులను నియమించాలి



నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఉద్యోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి)లో క్లాస్ 3, 4 ఉద్యోగ నియామకాలు వెంటనే చేపట్టాలని, 80 శాతం పైగా సభ్యత్వం ఉన్న అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘానికి గుర్తింపు ఇవ్వాలని ఆ సంఘం విశాఖ డివిజన్ ఉపాధ్యక్షులు టేకి ఆచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉద్యోగులు గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో గంట సేపు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీమా చట్టాల సవరణను, బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పెంపుదలను నిలిపివేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న ఎల్ఐసి రూ.52 లక్షల కోట్ల ఆస్తులు కలిగి దేశంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని అన్నారు. క్లైంల పరిష్కరించడంలో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉందని గుర్తు చేశారు. ఆర్థిక పరిపుష్టి కలిగిన ఎల్ఐసిని కేంద్ర ప్రభుత్వం బలహీన పరిచే చర్యలు చేపట్టడం అన్యాయమన్నారు. బీమా చట్టాల సవరణకు పూనుకొని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74 నుంచి 100 శాతానికి పెంచడం దుర్మార్గమన్నారు. సంస్థ పురోభివృద్ధికి, పట్టాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు క్లాస్ 3, 4 ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేసేందుకు వెంటనే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం బ్రాంచ్ అధ్యక్షులు ఎంమధుసూదనరావు, జి.శ్రీరామ్మూర్తి, పి.గంగాధర్ పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి, కె.శ్రీనివాస్ పాల్గొని సంఘీబావం తెలిపారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, యూట్యూబ్, ఎక్స్ (ట్విట్టర్) ఇతర సోషల్ మీడియాల వేదికగా ఇతరులను కించపరిచేలా అసభ్యకరమైన, అనైతిక, అవమానకర రీతిలో పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి హెచ్చరించారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటనను జారీ చేశారు. సామాజిక మాధ్యమాల్లో సమాజంలోని వ్యక్తులు, సంస్థలపై హేయమైన, అసత్య ప్రచారాలు, అవమానకర పదజాలంతో దూషణలు, బెదిరింపులు, కించపరిచే వ్యాఖ్యలు, ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్, ట్రోలింగ్ చేస్తే బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా గానీ కుల, మత, రాజకీయ విద్వేషాలు రగిల్చేలా, సున్నిత అంశాల్లో వదంతులు, అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించేలా పోస్టులు పెట్టరాదని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా ఓ మహిళా ఫొటోలు, వీడియాలు మార్ఫింగ్ చేసి వేధిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు శ్రీకాకుళం రెండో పట్టణ సిఐ పి.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.


మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ బాలమురళీకృష్ణ

అయోడిన్ లోపంతో అనారోగ్య సమస్యలు

డిఎంహెచ్ఒ డాక్టర్ బాలమురళీకృష్ణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అయోడిన్ లోపంతో ఎదురయ్యే అనారోగ్య సమస్యలపై క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఆశా వర్కర్లు పూర్తి అవగహన కలిగి ఉండాలని డిఎంహెచ్ఒ డాక్టర్ టి.బాలమురళీకృష్ణ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆశా కార్యకర్తలకు అయోడిన్ లోపంపై గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఢిల్లీకి చెందిన ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యాన అయోడిన్ లోపంతో ఎదురయ్యే అనారోగ్య సమస్యలపై రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు ముగిశాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమైన వెంటనే వైద్య సేవలు పొందడానికి ఈ శిక్షణలు ఉపయోగపడతాయని అన్నారు. ఐజిటి వంటి సంస్థ జిల్లాలో నాలుగు మండలాల్లో 40 గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మిగిలిన మండలాల్లోనూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ అనంతరం ఆశావర్కర్లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆశా కో-ఆర్డినేటర్ రవిప్రసాద్, డెప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్, ఐజిడి జిల్లా కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు, ట్రైనర్ డాక్టర్ ఎం.చైతన్య పాల్గొన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్ ఇడిగా వినాయకం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


వినాయకం, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి

షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులుగా కుడిమి వినాయకం గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక డిఆర్‌డిఎ కాంప్లెక్స్‌లోని ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లాలో రెవెన్యూ డివిజనల్ అధికారిగా పనిచేసిన ఆయన్ను ప్రభుత్వం ఎస్‌సి కార్పొరేషన్ ఇడిగా నియమించింది.


అవగాహన కల్పిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

పక్కాగా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మేజర్ పంచాయతీ టెక్కలిలో పారిశుద్ధ్య పనులు పక్కాగా అమలు చేయాలని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి సూచించారు. పంచాయతీ కార్యాలయంలో శానిటేషన్‌పై సచివాలయం సిబ్బందికి గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో పొడి, తడి చెత్త కోసం రెండు బకెట్లు ఇచ్చామని అన్నారు. వాటిల్లో వేర్వేరుగా చెత్త వేయాలని గృహదారులకు అవగాహన కల్పించాలన్నారు. కాలువల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అపరిశుభ్రాన్ని తొలగించి స్వచ్ఛ టెక్కలిగా తీర్చిదిద్దాలన్నారు. రోడ్లపై చెత్త వేయకూడదని స్థానికులకు సూచించారు. కాలువలపై అక్రమ నిర్మాణాలను చేపట్టిన వారికి నోటీసులు జారీ చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఆక్రమణ దారులు స్పందించకపోతే వెంటనే తొలగించాలన్నారు. ఆక్రమణలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈయనతో సర్పంచ్ గొండెల సుజాత, పంచాయతీ ఇఒ కె.వి.వి.జగన్నాధరావు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న అప్పన్న

జీడి రైతులను ఆదుకోవాలి

పాతపట్నం: గిరిజన జీడి రైతులు పండించిన జీడి పంటలకు మద్దతు ప్రకటించాలని, రైతు సేవా కేంద్రాలు ద్వారా కొనుగోలు చేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సీజన్లో ప్రధాన పంట జీడి అని అన్నారు. అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెడుతున్నారని అన్నారు. కనీస మద్దతు ధర లేకపోవడంతో గిరిజన రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. కార్యక్రమంలో కొత్తూరు, మెళియాపుట్టి మండల నాయకులు సవర సుంకయ్య, సవర ఆదినారాయణ పాల్గొన్నారు.



డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సిఐ చిన్నంనాయుడు

భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణం మీదగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే చర్యలు తీసుకుంటామని సిఐ మీసాల చిన్నంనాయుడు హెచ్చరించారు. ఈ మేరకు సర్కిల్ కార్యాలయంలో భారీ వాహనాల డ్రైవర్లకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరోసారి పట్టణం మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఇచ్ఛాపురం టౌన్ లోపలికి భారీ వాహనాలు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే భారీ మొత్తంలో అపరాధ రుసుం విధిస్తామని అన్నారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ ముకుందరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

కవిటి: తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 421వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా గురువారం దీక్షలో చిన్న బల్లిపుట్టుగకు చెందిన సభ్యులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తాము ప్రభుత్వ పథకాలకూ దూరమవుతున్నట్టు తెలిపారు. అందుకే తమకి గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



దీక్షల్లో పాల్గొన్న బెంతు ఒరియాలు

పాఠశాల ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్

● ఆక్రమణల తొలగింపులో రెవెన్యూ అధికారుల తాత్సారం
● రక్షణగోడ నిర్మాణ పనులకు ఆటంకం

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు జెడ్‌పి పాఠశాల స్థలం ఆక్రమణలో చిక్కుకుంది. 1961లో స్థాపించిన పాఠశాలకు అప్పట్లో గ్రామస్తులు సుమారు ఐదెకరాల భూమిని పాఠశాలకు అందజేశారు. అప్పటి నుంచి స్థలంలో కొన్ని పాఠశాల భవనాలు నిర్మాణాలు జరిగాయి. సుభద్రాపురం, చీపురుపల్లి రోడ్డున ఆనుకొని 14 షాపులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేశారు. మరికొంత మంది పశువుల షెడ్లు ఏర్పాటు చేశారు. మొత్తం ఈ ఆక్రమ కట్టడాలన్నీ పాఠశాలకు చెందిన స్థలంలోనే నిర్మాణం చేశారు. ఇటీవల ప్రభుత్వం పాఠశాలలకు రక్షణగోడ నిర్మాణానికి రూ.54 లక్షల నిధులు మంజూరు చేసింది. గోడ నిర్మాణ పనులు ప్రారంభానికి ముందు పాఠశాల మైదానానికి సంబంధించిన హద్దులు కొలతలు వేసి పాఠశాలకు సంబంధించిన స్థలం ఎక్కడ వరకు ఉందో సర్వే చేసి హద్దులు వేసి అప్పగించాలని పాఠశాల ఎస్‌ఎంసి ఛైర్మన్ లంకలపల్లి రాంబాబు, హెచ్‌ఎం పి.జగన్నాధరావులు రెవెన్యూ అధికారులకు జనవరి 2న దరఖాస్తు చేశారు. దీనిపై ఆ ఏడాది జనవరి 26న మండల సర్వేయర్, సచివాలయ సర్వేయర్‌లతో కూడిన సర్వే బృందం చుట్టూ బౌండరీ సరిహద్దులు కొలతలు వేశారు. పాఠశాల ప్రాంగణ సర్వే నెంబర్ 208-4, 200-2లో పాఠశాల ఉన్నట్టుగా గుర్తించారు. ఇందులో పాఠశాల స్థలంలోనే 14 షాపులు ఆక్రమణలో నిర్మాణం చేపట్టారని, అలాగే ఓ పక్క పశువుల రేకుల షెడ్ నిర్మించినట్టు గుర్తించారు. తర్వాత వీటిపై రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు సరికదా ఆక్రమణ తొలగింపుపై ఆక్రమ కట్టడాలు తొలగింపునకు రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారు. దీంతో రక్షణగోడ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఈ నిధులు మార్చిలోగా ఖర్చు చేయకపోతే నిధులు వెనక్కి వెళ్లిపోతాయని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తున్నా ఇక్కడ మాత్రం పనులు ముందుకు జరిగేలా లేవు. గతంలో 2013లో అప్పటి కలెక్టర్ సౌరబ్ గౌర్ లావేరు పర్యటనలో పాఠశాల సమీపంలో రహదారి ప్రక్కన పాన్‌షాప్ (బడ్డీ) ఉండడాన్ని గమనించి వెంటనే బడ్డీ పాఠశాల వద్ద ఉండరాదని వెంటనే తొలగించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. వెనువెంటనే ఆ బడ్డీని తొలగించారు. గత వైసిపి పాలనలో 2022లో కొంతమంది పాఠశాల స్థలంలోనే 14 షాప్‌లు, రేకుల షెడ్లు వేసి వాటిని వాణిజ్య సముదాయంగా నిర్మించారు. పాఠశాలకు రక్షణగోడ నిర్మాణం చేయాలంటే షాపులు తొలగించాలని, లేదంటే పనులు ముందుకు సాగే పరిస్థితి కనబడటం లేదని, పాఠశాల స్థలంలో ఉన్న ఆక్రమణలు రెవెన్యూ అధికారులు తొలగించే చర్యలు చేపట్టి పాఠశాలను భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా స్థలాన్ని పరిరక్షించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యవేత్తలు కోరుతున్నారు.


పాఠశాల స్థలంలో ఆక్రమంగా నిర్మించిన షాపులు

పాఠశాల సరిహద్దు కోసం దరఖాస్తు చేశాం



పాఠశాలకు చుట్టూ హద్దులు తేల్చాలని మండల రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేశాం. మండల సర్వేయర్, సచివాలయ సర్వేయర్ వచ్చి సర్వే చేశారు, హద్దులు చూపించారు. తమకు రాత పూర్వకంగా మండల రెవెన్యూ అధికారి ధ్రువీకరించిన పత్రాలు ఇప్పటికీ ఇవ్వలేదు. వాటికోసం చూస్తున్నాం.

- పి.జగన్నాధరావు, హెచ్‌ఎం

నివేదిక వచ్చాక ఆక్రమణలు తొలగిస్తాం



ఇప్పటికే రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. పాఠశాల స్థలంలోనే ఆక్రమణలు జరిగాయని, 14 షాపులు నిర్మాణం, పశువుల శాలకు రేకుల షెడ్లు వేసినట్లు గుర్తించడం జరిగింది. నింబంధనల ప్రకారం ఆక్రమణ దారులకు నోటీసులు ఇచ్చి ఆక్రమణలు పూర్తిస్థాయిలో తొలగిస్తాం.

- ఎన్ని జోగారావు, తహశీల్దార్


మాట్లాడుతున్న ఎపిడి శైలజ

ఇంకుడుగుంతల పనులు వేగవంతం

కోటబొమ్మాళి: మండలంలోని 38 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ ద్వారా రైతుల పొలాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాలు పెంపొందించేందుకోసం ఇంకుడు గుంతల పనులు వేగవంతం చేయాలని ఎపిడి పి.శైలజ అన్నారు. స్థానిక ఎంపిడి కార్యాలయ సమావేశ మందిరంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో మంజూరైన ఫర్మ్ ఫండ్స్ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. పంచాయతీ పంచాయతీలో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలన్నారు. కొలతలు ప్రాప్తికి పనులు చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిఒ జి.హరిప్రసాద్, ఇసి టి.రాంబాబు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు శిక్షణ

పలాస : శిక్షణను అంగన్వాడీ సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ చంద్రశేఖరరావు అన్నారు. కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణను పరిశీలించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ పార్వతి, ఎంఇఒలు శ్రీనివాసరావు, సత్యం, ఆర్‌పి సంతోష్‌కుమార్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు గంగమ్మ, సరస్వతి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక జిల్లా పరిషత్ బాలురు పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బంది శిక్షణను ఎంఇఒలు చండక గోవిందరావు, ఎల్.వి.ప్రతాప్‌లు పరిశీలించారు. డిఆర్‌పిలు మురళీధర్, చిన్నారావు, వేణుగోపాల్, సూపర్‌వైజర్లు సత్యప్రియ, మనోహరి, పద్మలత పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రాపాకలో ఎన్‌సిడి సర్వే

పొందూరు: మండలంలోని రాపాకలో నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ (ఎన్‌సిడి) సర్వేను గురువారం స్థానిక వైద్య సిబ్బంది ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి కేన్సర్, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను పరీక్షించి వివరాలను నమోదు చేశారు. ఇప్పటివరకూ మొత్తం సుమారు 1100 ఇళ్లకు గాను 300 ఇళ్లల్లో సర్వేను చేపట్టారు. ఎఎన్‌ఎంలు ఉదయ్‌లక్ష్మి, వనజాక్షి, ఎంఎల్‌హెచ్‌పిలు లావణ్య, జ్యోత్స్న, ఆశ కార్య కర్తలు లక్ష్మి, రాజేశ్వరి, పుణ్యావతి, ఉషారాణి పాల్గొన్నారు.

కుల వృత్తులకు ప్రభుత్వ సహకారం

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వివిధ రూపాల్లో సహకారాన్ని అందిస్తోందని, సాంకేతికతను కులవృత్తుల వారు అన్వయించుకుని మెరుగైన ఆదాయాన్ని పొందాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గురువారం నగరంలోని కలెక్టరేట్ వద్ద గల దోభీ ఘాట్లను ఆయన పరిశీలించారు. నాగావళి నదిలో దోభీఘాట్ల వద్ద చేరుతున్న మురుగును తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని హామీఇచ్చారు. మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణం అసంపూర్తిగా ఉండడం వల్ల నగరంలోని వ్యర్థ జలాలు నాగావళి నదిలోకి వచ్చి చేరుతున్నాయని, దీనివల్ల బట్టలు ఉతకడానికి సరిగా నీరందడం లేదని పలువురు రజకులు ఆయనకు వివరించారు. వారికి మౌళిక వసతులు కల్పించడానికి తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు.


దోబీ ఘాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

రజకులకు, బ్రాహ్మణులకు ప్రభుత్వం కేటాయించిన స్థలాలకు రహదారి సౌకర్యం లేదని వారు వివరించారు. అలాగే వేసవి కాలంలో మధ్యాహ్నం పూట దోబీఘాట్ల వద్ద సేద తీరేందుకు షెడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయనతో పాటు కొత్తపేట, పాతశ్రీకాకుళం ప్రాంతాలకు చెందిన పలువురు పాల్గొన్నారు.

పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న బలరాం

ప్రజాశక్తి- పలాస

ఆప్కాస్ రద్దు చేసి మున్సిపల్ కార్మికులను మళ్లీ కాంట్రాక్టర్ల కబంధ హస్తాలకు అప్పగించే కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తుందని, రెగ్యులర్ పోరుకు సిద్ధం కావాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.బలరాం, సిఐటియు నాయకులు ఎన్.గణపతిలు పిలుపునిచ్చారు. స్థానిక మనకినమ్మ ఆలయం ఆవరణలో పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్మికుల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మళ్లీ కాంట్రాక్టు విధానానికి వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, వినతిపత్రాలు సమర్పించాలన్నారు. పోస్ట్‌కార్డు ఉద్యమం, నల్ల బ్యాడ్జీలతో నిరసన, ధర్నా, ఆందోళనలు దశలవారీగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షులు సిహెచ్.మురగన్, యూనియన్ నాయకులు కె.వెంకటి, బి.కూర్మారావు, ఎస్.రమేష్, బాలకృష్ణ, ఎస్.శంకర్, తిరుపతి, భాస్కర్, గులాబి, సీతమ్మ, శకుంతల, ప్రకాష్ ముఖి, త్రివేణి పాల్గొన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

శ్రీకాకుళం అర్బన్ యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి తోటి వారికి ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి చేరుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్ పిలుపునిచ్చారు. నగరంలోని గీతం డిగ్రీ కళాశాలలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మూడు రోజులపాటు శిక్షణా తరగతులను నిర్వహించారు. గురువారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ యువతకు అనేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలను, పారిశ్రామిక వేత్తలను తయారు చేయడమే శిక్షణ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

అనంతరం 50 మంది ఔత్సాహికులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.రమేష్, ఎడిఎస్ డిఒ చంద్రమౌళి, ప్లేస్మెంట్ ఆఫీసర్ వంశీకృష్ణ, ఎన్‌టిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, శిక్షణ కో-ఆర్డినేటర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి ఉమాపతి

నౌపడలో పారిశుధ్య పనులు

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడలో కార్యదర్శి ఉప్పాడ ఉమాపతి ఆధ్వర్యాన గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. దీనిలోగా భాగంగా పారిశుధ్య సిబ్బంది కాలువల్లోని పూడికలు తొలగించారు. అనంతరం వీధుల్లో చెత్తను తొలగించి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. కాలువుల్లో బ్లీచింగ్ చల్లించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, బిల్లు కలెక్టర్ రంజిత్ పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన భారతీ దివ్య


జగన్‌తో భారతీ దివ్య

ఇచ్ఛాపురం : పార్వతీపురం మన్యం జిల్ల పాలకొండలో మాజీ సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి గురువారం పర్యటించారు. ఈ మేరకు ఇచ్ఛాపురం మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్, జిల్లా వైసిపి మహిళా అధ్యక్షులు ఉలాల భారతీ దివ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఇచ్ఛాపురం నియోజక వర్గం ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, అధికార పార్టీ చేస్తున్న అరాచకాలను జగన్ దృష్టికి తీసుకెళ్లారు.

ముగిసిన 'పది' ప్రీ ఫైనల్ పరీక్షలు

ప్రజాశక్తి- టెక్కలి

పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు సాంఘీకశాస్త్ర పరీక్ష నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యాన ఈ నెల పదో తేదీన పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పది రోజుల్లో మధ్యలో కొద్ది రోజులు విరామం ప్రకటించారు. ప్రీ ఫైనల్ పరీక్షలు ముగిసిన నేపథ్యంలో విద్యార్థులు రాసిన జవాబు పత్రాలు మూల్యాంకనం చేస్తారు. విద్యార్థులు రాసిన జవాబు పత్రాల్లో వారు చేసిన పొరపాట్లను సరిదిద్ది వార్షిక పరీక్షలు ఎటువంటి లోపాలు లేకుండా వీలుగా తీర్చిదిద్దుతారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ప్రోహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని సిఐ పి.డి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇప్పటికే బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ నెల 16 నుంచి 19 వరకు ముమ్మరంగా దాడులు చేపట్టామని అన్నారు. ఒడిశా మద్యం కేసు, డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసులు మూడు నమోదయ్యాయన్నారు. సారా కేసులో పట్టుబడిన 18 మంది నిందితులను తహశీల్దార్ వద్ద బైండోబర్ కేసు నమోదు చేశామని అన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే... టోల్ ఫ్రీ నంబరు 14405కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఎన్నికల పరిశీలకునిగా 'గురజాపు'

ప్రజాశక్తి- రణస్థలం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు శ్రీకాకుళం నియోజకవర్గానికి కూటమి తరపున తనను పరిశీలకులుగా నియమించినట్లు రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము గురువారం తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గెలుపునకు కృషి చేస్తామన్నారు.

గ్రావెల్ తవ్వకాలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి- రణస్థలం

మండలం ముక్తంపురం గ్రామ రెవెన్యూ సర్వే నంబర్-58లోని ప్రభుత్వ భూమి (కొండ పోరంబోకు)లో ఎటువంటి ఆక్రమణలు చేసినా, అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపినా చర్యలు తప్పవని తహశీల్దార్ ఎన్.ప్రసాద్ హెచ్చరించారు. ఈ మేరకు కొండ ములగాం గ్రామ రెవెన్యూ అధికారి ఎల్.వి.అప్పలనాయుడు సంబంధిత స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ హెచ్చరికను దిక్కరించి ఎటువంటి ఆక్రమణలు చేసినా, అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపినా ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోస్టాఫీసు ఎక్కడ?

ప్రజాశక్తి- కవిటి

బాబు ఇక్కడ పోస్టాఫీసు (తపాలా కార్యాలయం) ఉండాలి. ఇప్పుడు ఎక్కడ పెట్టారు... అంత దూరం పెడితే మాలాంటి వారి పరిస్థితి ఏంటి బాబు అంటూ కవిటి మండలం తొత్తిడిపుట్టుగకు చెందిన ఓ పెద్దావిడ ఇటీవల వాపోయారు. ఇది ఆవిడ ఒక్కరి పరిస్థితే కాదు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న అనేక మంది పోస్టాఫీసు వినియోగదారుల పరిస్థితి.

జనావాసాలకు దూరంగా...

మేజర్ పంచాయతీ, మండల కేంద్రం కవిటి ప్రధాన కూడలిలో ఎప్పటినుంచో అద్దె గృహంలో కొనసాగుతున్న పోస్టాఫీసు అద్దె భారం పేరుతో గ్రామానికి మారుమూల ఉన్న ఓ ప్రాంతానికి తరలించారు. ఇక అప్పటి నుంచి పోస్టాఫీసు వినియోగదారులకు తిప్పలు ప్రారంభమయ్యాయి. బడుగు బలహీన వర్గాలు, గ్రామీణ ప్రాంత మహిళలకు మొదట నుంచి తపాలా శాఖపై విపరీతమైన నమ్మకం. తపాలా శాఖలో సుమారు 90 శాతం ఖాతాలు గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు, మహిళలవే ఉంటాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రధాన కూడలిలో ఉన్న తపాలాశాఖ తరలించడంతో వారికి కష్టాలు మొదలయ్యాయి. గతంలో ఆటో దిగగానే తమకు అందుబాటులో ఉండే పోస్టాఫీసు కోసం ఇప్పుడు కిలో మీటరు మేర నడవడమే కాకుండా చాలా మందికి ఎక్కడ ఉందో కూడా తెలియకపోవడం సమస్యగా మారుతోంది. ప్రస్తుత రోజుల్లో ప్రధాన కూడలిలో అద్దెకొంప దొరకడమే కష్టం. అటువంటిది ఎప్పటి నుంచో తమ ఆధీనంలో ఉన్న అద్దె గృహాన్ని చేజేతులా వదులుకోవడం కూడా విమర్శలకు తావిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళలు, వృద్ధులు ప్రస్తుతం తపాలా కార్యాలయానికి చేరుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు.

ఫలితం లేని దాతృత్వం

మరోవైపు కొన్ని దశాబ్దాల కిందటే కవిటికి చెందిన బెందాళం పట్టాభి సీతారామయ్య దాతృత్వంతో బజారు వీధిలో పోస్టాఫీసు నిర్మాణానికి తన సొంత భూమిని విరాళంగా అందించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ భూమి నిరుపయోగంగా ఉందే తప్ప అక్కడ పోస్టాఫీసు నిర్మించే ప్రయత్నం ఇంతవరకు జరగకపోవడం శోచనీయం. దీంతో ప్రస్తుతం కొన్ని కోట్లు విలువ చేసే ఆ భూమి పెళ్లిళ్లు, పేరంటాలకు భోజన సదుపాయాలు కల్పించుకోవడానికి, స్థానికులు వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి ఉపయోగ పడుతోంది. మరోవైపు ఎంతో విలువైన భూమి కేటాయించినా పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఉపయోగించుకోవడంలేదని, దీంతో ఆ ప్రాంతాన్ని స్థానికులు పారిశుధ్య కేంద్రంగా వాడుకోవడం ప్రారంభించడంతో అక్కడ పాములు చేరుతున్నాయని సీతారామయ్యకు చెందిన వారసులు అంటున్నారు. దీనిపై తాము పోస్టల్‌శాఖ జిల్లా అధికారులకు వినతిపత్రాలు కూడా అందించామని తెలిపారు. ఆ ప్రదేశంలో తపాలా శాఖ కార్యాలయం నిర్మించాలని లేదంటే తమకు అప్పగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఎంతో ముందుచూపుతో సీతారామయ్య చేసిన దాతృత్వానికి ఫలితం లేకపోతోందని స్థానికులు, పోస్టాఫీసు వినియోగదారులు వాపోతున్నారు.

పాలకుల చొరవ తప్పనిసరి

ఇటువంటి పరిస్థితుల్లో స్థానిక పాలకుల చొరవ చూపించి సీతారామయ్య కేటాయించిన స్థలంలో పోస్టాఫీసు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఎంతో విలువైన భూమి నిరుపయోగంగా ఉండడం సరికాదని, దాంట్లో పోస్టాఫీసు నిర్మిస్తే ఇచ్చిన దాతకు, అతని దాతృత్వానికి నిజమైన ఫలితం ఉంటుందని అంటున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి కవిటిలో శాశ్వత తపాలా శాఖ కార్యాలయం నిర్మించాలని స్థానికులు, వినియోగదారులు కోరుతున్నారు.


పోస్టాఫీసుకు కేటాయించిన స్థలం


తిరుపతి మృతదేహం

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని కొర్లాం పంచాయతీ బ్రాహ్మణకొర్లాంలో బుధవారం రాత్రి విద్యుదాఘాతంతో పలాసకు చెందిన చల్ల తిరుపతి (22) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బ్రాహ్మణకొర్లాంలో ఓ వివాహానికి క్లాత్ డెకరేషన్ చేసేందుకు పలాస నుంచి కొంచాడ సురేష్ వెంట వచ్చాడు. పనులు చేస్తుండగా తిరుపతి పక్కనే 11 కెవి విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. స్థానికులు విద్యుత్ లైన్‌ను నిలుపుదల చేసిన వెంటనే బారువ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఎస్ఐ హరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- మందస


జగ్గారావు మృతదేహం

మండలంలోని అంబుగాం పంచాయతీ పెద్దలింబుగాకు చెందిన నర్తు జగ్గారావు (53) కిడ్నీ వ్యాధితో గురువారం మృతి చెందారు. జగ్గారావు మూడేళ్లుగా కిడ్నీ వ్యాధి బారిన పడ్డారు. తరచూ డయాలసిస్ చేసుకుంటున్నాడు. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృతి చెందారు.

గాయపడిన మహిళ మృతి

కోటబొమ్మాళి: మండలంలోని గాయపడిన మహిళ గురువారం మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని పెద్దబమ్మిడి జాతీయ రహదారిలో ఈ నెల 3న సంభవించిన రోడ్డు ప్రమాదంలో సుబ్బారావుపేటకు



చెందిన బాన్న ప్రత్యూష (29) తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు జిల్లా సర్వజనాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం పరిస్థితి విషమించి మృత్యువాత పడింది. తన భర్త నడుపుతున్న ఆటోలో వస్తుండగా ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. భార్యాభర్తలు ఇద్దరూ డాన్స్ మాస్టార్లుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మృతురాలికి భర్త కిరణ్‌కుమార్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడు త్రినాథరావుగా గుర్తింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


త్రినాథరావు (ఫైల్)

నగ రంలోని హయాతీ నగరం సమీపాన నాగావళి నదిలో లభ్యమైన మృతదేహాన్ని కుటుంబసభ్యులు గుర్తిం చారు. పత్రికల్లో ప్రచురితమైన ఫోటో ఆధారంగా మృతుడు తోటపాలెం రోడ్డులో గల నీలమ్మకాలనీకి చెందిన దుండ త్రినాధరావు (45) అలియాస్ హరిగా కుటుంబసభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. ఈనెల 14న ఇంటి నుంచి వెళ్లిన మృతుడు తిరిగి రాలేదని భార్య వెంకటలక్ష్మి తెలిపింది. మృతుడు త్రినాధరావు నగరంలోని పిఎస్‌ఎన్‌ఎం స్కూల్ వద్ద దుకాణంలో కమ్మరి పని చేస్తూ కుటుంబ పోషణ చేస్తున్నట్టు ఆమె వివరించింది. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు రిమ్స్ మార్చురీ వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్ప గించారు. ఆయన మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

బంగారు బిస్కెట్ మాయగాళ్ల అరెస్టు

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీకి చెందిన దుక్క దేవి కిలో బంగారం రూ.10 లక్షలకే ఇస్తామని చెప్పి పలువురు నుంచి రూ.కోటికిపెగా వసూళ్ల చేసిన విషయం విదితమే. ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్న దుక్క దేవి, బుడ్డేపు లోకేష్ బుడ్డేపు సావిత్రి, పైల లక్ష్మి, దుక్క జగదాంబలపై కేసు నమోదు చేసి కోటబొమ్మాళి కోర్టుకు తరలించినట్లు నౌపడ ఎస్ఐ నారాయణస్వామి తెలిపారు. నౌపడకు దుక్క దేవి, బుడ్డేపు లోకేష్ అదే గ్రామానికి చెందిన కమ్మకట్ల భాగ్యలక్ష్మికి కిలో బంగారం బిస్కెట్లు రూ.10 లక్షలకే ఇస్తామని ఆశ చూపి రూ.2 లక్షలు నగదు తీసుకున్నారని అన్నారు. తక్కువ ధరకే ఇస్తామన్న బంగారు బిస్కెట్లు ఇవ్వకపోవడంతో పలుమార్లు బాధితరాలు నిందితులను నిలదీసిందన్నారు. ఈ విషయం గ్రామపెద్దలు వద్ద పలుమార్లు చర్చించినా ఫలితం దక్కాలేదన్నారు. ఈ నెల 9వ తేదీన నిందుతులు దుక్క దేవి, లోకేష్, సావిత్రి, పైల లక్ష్మి కలిసి బాధితురాలు కమ్మకట్ల భాగ్యలక్ష్మికి కొట్టడం, బలమైన గాయం చేయడంతో నౌపడ పోలీసులను ఆశ్రయించిందన్నారు.

ఆవులు తరలిస్తున్న వాహనాలు సీజ్

ఆమదాలవలస: మండల కేంద్రంలోని సరుబుజ్జిలి నాలుగు రోడ్ల కూడలిలో గురువారం తెల్లవారు జామున కబేళాలకు ఆవులను తరలిస్తున్న మూడు వాహనాలను ఎస్ఐ బి.హైమావతి పట్టుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు రాత్రి గస్తీ విధుల్లో భాగంగా సరుబుజ్జిలి జంక్షన్ నాలుగు రోడ్ల కూడలిలో సిబ్బందితో విధులు నిర్వహిస్తుండగా హిరమండలం వైపు నుంచి వస్తున్న మూడు వాహనాలను ఆపి తనిఖీ చేయగా అందులో మూగ జీవాలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కి తరలించినట్టు తెలిపారు. మూడు వాహనాల్లో ఉన్న ఎనిమిది మందిని విచారించగా ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో ఈ గోవులను కొనుగోలు చేసి కబేలాలకు తరలిస్తున్నట్లు తేలిందన్నారు. ఎనిమిది మంది వ్యక్తులపై కేసు నమోదు చేసి మూడు వాహనాలను సీజ్ చేసిన అనంతరం ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం హాజరుపర్చినట్టు తెలిపారు. మూడు వాహనాల్లో ఉన్న 28 గోవులను పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో విజయనగరం జిల్లా గుర్ల మండలం గుజంగివలసలో ఉన్న పశు సంరక్షణ గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.


అదుపులోకి తీసుకున్న వాహనాలు


జగన్మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రవికుమార్ తదితరులు

పవర్‌ప్లాంట్‌పై జగన్‌కు వినతి

ఆమదాలవలస : సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న థర్మల్ పవర్ ప్లాంట్‌పై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ వినతిపత్రం అందించారు. గురువారం మన్యం జిల్లా పాలకొండలోని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఇంటికి పరామర్శకు వచ్చిన జగన్మోహన్ రెడ్డిని కలిసి సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న థర్మల్ పవర్ ప్లాంట్ వలన కలిగే అనర్థాలు, గిరిజనుల ఇబ్బందులను జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. సమస్యను సావధానంగా విన్న జగన్మోహన్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు రవికుమార్ తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ కార్యదర్శి అత్తులూరి రవికాంత్ ఉన్నారు.


మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

'వన్ దన్'కు పంటలు విక్రయించాలి

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- మందస

గిరిజన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వన్ దన్ వికాస కేంద్రాన్ని ప్రారంభించిందని, గిరిజనులు పండించిన పంటలకు వన్ దన్ కేంద్రానికి విక్రయించాలని వెలుగు ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని కొండలోగాంలో గ్రామ సంఘం ప్రెసిడెంట్ హేమలత అధ్యక్షతన విఒ పాలకవర్గ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లోని రైతులు, మహిళలు తమకు పండిన జీడి పిక్కలను విడివికే ద్వారా ప్రాసెసింగ్ చేయించుకొని తద్వారా గిట్టుబాటు ధరతో పాటు అధిక ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. మహిళలు మైక్రో ఫైనాన్స్ సంస్థల బారిన పడకుండా, స్వయంశక్తి సంఘం, గ్రామ, మండల సమాఖ్య సేవలను కట్టుబాటులను పాటిస్తూ సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు ఢిల్లేశ్వరి, గ్రామ సంఘం ప్రతినిధులు దశమి, రేవతి, వరలక్ష్మి, లలిత విఒఎలు ఆనంద్, జగబందు, వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్ స్వామినాయుడు, సర్పంచ్ ప్రతినిధి రోజా, ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.



పోస్టుకార్డులను విడుదల చేస్తున్న ఎస్‌టియు నాయకులు

హామీల అమలుకు పోస్టుకార్డు ఉద్యమం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఎస్‌టియు ఆధ్వర్యాన పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపడుతున్నట్టు ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ తెలిపారు. గురువారం నగరంలోని క్రాంతి భవన్‌లో సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గానికి అప్పటి ప్రభుత్వ తీసుకొచ్చిన పిఆర్‌సి రివర్స్ పిఆర్‌సి అని చెప్పిన నాయకులు నేటివరకు అందులో లోపాలను సరి చేయలేదన్నారు. బకాయిలు చెల్లింపు, డిఎలు, ఐఆర్ చెల్లింపుపై మాట్లాడడం లేదన్నారు. అలాగే పిఆర్‌సి కమిటీ, సిపిఎస్ రద్దు వంటి హామీలను నెరవేర్చాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె. శ్రీనివాసరావు, చింతల రామారావు, బి.శ్రీధర్, జి.శ్రీనివాసరావు, ఎం.తేజ, ఎన్.లక్ష్మణరావు, పి.వసంత్ కుమారి, డివిఎస్ పట్నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లావణ్య

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

పాతపట్నం : మండలంలోని గురండి, సింగుపురం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఐ బి.లావణ్య విద్యార్థులకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా విద్యార్థుల ఒంటిపైన ఎవరైనా టచ్ చేస్తే మీరు నిర్మూలించాలన్నారు. వెంటనే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. అలాగే సైబర్ నేరాలపై, దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు, అపరిచిత కాల్స్ ఏవైనా వస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు, టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలన్నారు.

ఎర్రవరంలో పడకేసిన పారిశుధ్యం



ప్రజాశక్తి- రణస్థలం

మండల పరిధిలోని ఎర్రవరం గ్రామంలో అపారిశుధ్యంతో దుర్గంధం వెదజల్లుతూ దోమలు, ఈగలు ప్రబలుతున్నా పంచాయతీ అధికారులు మీనమేషాలు లెక్కించడం, ప్రజలు ఎన్నిమార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన చెందు తున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం వలన గ్రామంలో పారిశుధ్యం పడకేసిందని గ్రామస్తులు పెదవిరుస్తున్నారు. ఒకపక్క ఉన్నతాధికారులు తిరిగి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని చెబుతుంటే దీనికి విరుద్ధంగా ఎక్కడ మురికి అక్కడే కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నా కార్యదర్శి నిమ్మకు నీరెత్తిన విధంగా వ్యవహరిస్తున్నాడని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా, రోడ్డుమీద సైతం మురికినీరు నిలిచి ఉండడం, కాలువల్లో మురుగు నీరు నిల్వలు ఉండిపోవడంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నామని, గతంలోనూ డెంగీ, టైఫాయిడ్, మలేరియా బారిన పడ్డామని గ్రామస్తులు వాపోతున్నారు. కార్యదర్శి మాత్రం గ్రామంలో ఏనాడు బ్లీచింగ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయించిన దాఖలాలు లేవని, కార్యదర్శి కాలక్షేపానికి తన ఉద్యోగాన్ని చేస్తున్నట్లు పలువురు విమర్శిస్తున్నారు. కార్యదర్శి అలసత్వం వలనే గ్రామంలో మురికి పెరిగిపోతుందని పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి



ఎర్రవరంలో పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

23న జిల్లాస్థాయి చదరంగం పోటీలు

టెక్కలి : ఈ నెల 23న టెక్కలిలో జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా నాయకులు సనపల భీమారావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక తెంబూరు రోడ్డు వద్ద ఉన్న ఓక్లాండ్ అంతర్జాతీయ పాఠశాల ఆవరణలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి ఆసక్తి ఉన్న క్రీడాకారులు పాల్గొవాలని కోరారు. ఈ పోటీలకు పదో తరగతి వరకు చదువుతున్న వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రవేశ రుసుం రూ.300 చెల్లించి పాల్గొవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9492802386కి సంప్రదించాలన్నారు.

శిష్టకరణ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షునిగా రవికుమార్


రవికుమార్

టెక్కలి : శిష్టకరణ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షునిగా సదాశివుని రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రం వ్యవస్థాపక అధ్యక్షులు మానాం పురం సురేష్‌కుమార్ గురువారం అందజేశారు. శిష్టకరణ తరగతికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడానికి కృషి చేస్తున్న సురేష్‌కుమార్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా నౌపడా నర్సింగరావు, కోశాధికారిగా డబ్బీర్ మానస్ వినోద్, ఉపాధ్యక్షునిగా బెహరా రాజేష్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు.

ఎంఇఒ తనిఖీ

పాతపట్నం : మండలంలోని తిడ్డిమి ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఎంఇఒ చింతాడ తిరుమలరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. నేటి విద్యార్థులే రేపటి భారతదేశ పౌరులని, వారిని తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నదని అన్నారు. ప్రస్తుత పరిజ్ఞానానికి అనుగుణంగా బోధన చేయాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సిఆర్‌ఎంటి కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

కార్మిక కుటుంబానికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుల్లో సహచరుడు రాజమతి అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందారు. దీంతో పారిశుధ్య కార్మికులందరూ తలో కొంత సహాయం చేసి రూ.30 వేలు సేకరించారు. ఈ నగదును ఎమిషనర్ రమేష్ గురువారం బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ రమేష్ కుమార్ పట్నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

రక్తదానానికి స్పందన

శ్రీకాకుళం అర్బన్ : రక్తదానంపై అపోహలు వీడి యువత రక్తదానం చేయాలని, రక్తం కొరతలేని శ్రీకాకుళం కావాలని జెసిఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ అధ్యక్షులు సింగూరు ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం సన్‌రైజర్స్ ఆధ్వర్యాన విజయశ్రీ రక్తనిధి కేంద్రంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ జెసిఐ ఆధ్వర్యాన ఏడాది సుమారు వెయ్యి యూనిట్ల రక్తాన్ని సేకరించి రక్తం కొరతలేని జిల్లాగా నిలపాలన్నదే తమ ధ్యేయమన్నారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. నగరంలో రక్తం కొరత, సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ కొరత ఎక్కువగా ఉందని, యువత సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జెసిఐ మెయిన్ వ్యవస్థాపకులు డా.బీమ శంకర్, సన్ రైజర్స్ వ్యవస్థాపకులు దూసి సంతోష్, పాస్ట్ ప్రెసిడెంట్ డా.వినోద్, వైస్ ప్రెసిడెంట్ షర్మిల తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువత

డిపాజిట్ ఖాతాల కోసం తెలుసుకోవాలి


సైబర్ నేరాలు, బ్యాంకింగ్ సమాచార బుక్‌లెట్‌ను ప్రదర్శిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

బ్యాంకింగ్ డిపాజిట్ ఖాతాల కోసం ప్రతిఒక్కరూ క్షుణ్ణంగా తెలుసుకోవాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ సిహెచ్ రవికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో మహిళలకు సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ వి. ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ వి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తప్పనిసరిగా బ్యాంకింగ్ ఖాతాను తెరవాలని, ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండి బ్యాంకు సేవలను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం వెలుగు ఎపిఎం గురుగుబెల్లి నారాయణరావు మాట్లాడుతూ బ్యాంక్‌ఖాతా కలిగి ఉంటే కలిగే లాభాలు, సదుపాయాలు, సౌకర్యాలను వివరించారు. ట్రైనర్ ఎస్.రాంబాబు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ డిపాజిటర్‌ను బ్యాంకు వైపు మొదటి అడుగు వేయించడం, బ్యాంకు ఖాతా తెరిచి నిర్వహించడం, డిపాజిట్ ఖాతాలతో అదనపు ప్రయోజనాలు పొందడం, సైబర్ నేరాలు మొదలగు వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టి డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ ఎ.హరినాథ్, సిఎఫ్ఎల్ సిబ్బంది బొడ్డేపల్లి చంద్రశేఖర్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేలన్నీ పూర్తి చేయాలి

ప్రజాశక్తి- పాతపట్నం

ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మంచు కరుణాకరరావు, ఎంపిడిఒ చంద్రకుమారి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సచివాలయ సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్క సర్వేలోనూ పాతపట్నం మండలం ముందుగా ఉండేటట్లు చూడాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. ఇళ్లు లేని లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు కట్టుకునేలా


మాట్లాడుతున్న కరుణాకరరావు

అవగాహన కల్పించాలన్నారు. పిఎం సూర్యఘర్ పథకం కింద వీలైనంత ఎక్కువ మందిని లబ్ధిదారులుగా రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలన్నీ ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. మండలంలో ఆరు చోట్ల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని, వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వెంకటరావు, హౌసింగ్ ఎఇ సీతారాం పాల్గొన్నారు.

నాణ్యమైన పదార్థాలు అందించాలి

మున్సిపల్ కమిషనర్ రామారావు


మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

ప్రజాశక్తి- పలాస

హోటళ్ల యాజమానులు ప్రజలకు నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలు అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు సూచించారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల యజమానులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వాలిటీ ఆహార పరిమాణాలను కచ్చితంగా పాటించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. అందరూ ఒకే రకమైన రేట్లు నిర్వహించాలన్నారు. వంట నూనెలు ఒక్కసారే వినియోగించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి ప్రభాకరరావు, టౌన్ ప్లానింగ్ అధికారి వరప్రసాదరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి- పలాస

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కళ్యాణచక్రవర్తిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్


వినతిపత్రం అందజేస్తున్న వినోద్‌కుమార్

విడుదల చేయాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. యుజిసి డ్రాఫ్ట్ సవరణను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయ్, రవికుమార్ పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

శివరాత్రి ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- జలుమూరు

మండలంలోని శ్రీముఖలింగంలో శ్రీముఖలింగేశ్వర స్వామి శివరాత్రి జాతర ఉత్సవాల ఏర్పాట్లను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గురువారం పరిశీలించారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూ లైన్లలో యాత్రికులకు ప్రసాదం వితరణ, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ అలంకరణ తదితర అంశాలపై స్థానిక నాయకులతో, కార్యకర్తలతో చర్చించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమల్లో ఉండడం వల్ల పూర్తి స్థాయిలో నిధులు సమీకరణ, అధికార యంత్రాంగంతో సమీక్ష నిర్వహించలేకపోయామని అన్నారు. ఈ విషయమై జిల్లా అధికారులతో మాట్లాడి సంబంధిత అధికారులకు శివరాత్రి వేడుకలు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అసిస్టెంట్ లేబర్ అధికారి కొండలరావు

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు

ప్రజాశక్తి- పొందూరు

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పాల్గొంటున్న వేతనదారులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు కావాలని అసిస్టెంట్ లేబర్ అధికారి బి.కొండలరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎన్‌ఆర్ఇజిఎస్, ఇంజినీరింగ్ సహాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-శ్రమ్‌లో నమోదైన వేతనదారులకు పాక్షిక అంగవైకల్యం కలిగితే రూ.లక్ష, శాశ్విత అంగవైకల్యం కలిగితే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు పొందవచ్చునని పేర్కొన్నారు. 16 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయసు కలిగిన శ్రామికులందరూ ఈ-శ్రమ్‌లో నమోదు కావచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మీసాల మన్మధరావు, ఎపిఒ శ్రీనివాస్, పిఆర్ ఎఇ అనంతరావు తదితర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఘనంగా భాషా ఉత్సవాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో కొళిగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం భాషా ఉత్సవాలు ప్రారంభమ య్యాయి. రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు మేరకు నాలుగు రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ తెలిపారు. అందులో భాగంగా మండలంలోని కొళిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒరియా భాషకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల్లో పఠనాసక్తి, అభ్యసనాసక్తి, సృజనాత్మకత పెంపొందించడం, కలిసి, మెలిసి చదువుకునేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. అన్య భాషలనూ నేర్చుకునే విధంగా విద్యార్థులను ప్రోత్సహి స్తున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మిను, నిలిప్, జ్యోతి, పద్మావతి, రేణుక, చంద్రవదన, శ్రీనివాస్ పూండి, స్వప్న, బర్ష, సోమేష్, పాపారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బొడ్డాంలో టిడిపి సభ్యత్వం

ప్రజాశక్తి- పోలాకి

టిడిపి సభ్యత్వం నమోదు చేసుకోవడం శ్రేయస్కరమని సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన సూచించారు. మండలంలోని బొడ్డాం పంచాయతీలో గురువారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం పొందిన వారికి అన్ని విధాలా ఆదుకుంటందని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, కూటమి నాయకులు భైరి భాస్కరరావు, మెట్ట వైకుంఠరావు, కరుకోట రమేష్, ఇలపండ ధర్మారావు, పి.ప్రసాదరావు, దుశ్యంత్, లవన్న పాల్గొన్నారు.


నమోదును పరిశీలిస్తున్న అర్చన